www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం
28 మార్చి 2025




## విలేఖరులు కావలెను
కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రెయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003




# అసెంబ్లీ నిరవధిక వాయిదా

- 11 రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు
- 97 గంటల 32 నిమిషాల పాటు జరిగిన సభ
- 3 తీర్మానాలను ఆమోదించిన శాసనసభ

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు గురువారం రాత్రి నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 11 రోజులపాటు నిరంతరంగా కొనసాగిన ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక అంశాలను చర్చించి, ఆమోదం తెలిపింది. సభలో ద్రవ్య వినిమయ బిల్లుతో పాటు పలు ముఖ్యమైన తీర్మానాలు ఆమోదించబడ్డాయి. గురువారం ఉదయం 10 గంటలకు సభ సమావేశమైంది. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉభయసభల్లో ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. సభలో మొత్తం మూడు బిల్లులపై చర్చ జరిగి, వాటికి ఆమోదం లభించింది.

డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క 2025 ద్రవ్య వినిమయ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని మీద సుదీర్ఘంగా చర్చించిన అనంతరం సభ దీనికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశాలు గత నెల ఫిబ్రవరి 24న ప్రారంభమై, మార్చి 27వ తేదీ వరకు కొనసాగాయి. మొత్తం 11 రోజులపాటు అసెంబ్లీలో జరిగిన చర్చలు రాష్ట్ర పాలనలో కీలక మైలురాయిగా నిలిచాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులకు విపక్షాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ మిశ్రమ స్పందనను అందించాయి. ఈ సమావేశాల్లో జరిగిన చర్చలు, ఆమోదితమైన బిల్లులు రాష్ట్ర ప్రజల జీవితాలపై ఎంత ప్రభావం చూపుతాయో సమయం తెలియజేస్తుంది. అసెంబ్లీ తిరిగి సమావేశమయ్యే వరకు ప్రభుత్వ పాలనా విధానాలపై ప్రజల్లో చర్చ కొనసాగుతూనే ఉంటుంది.



# అప్పుల్లో రైజింగ్

**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

- రొటేషన్ చక్రవర్తిలా ప్రభుత్వం
- అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులే
- ఇచ్చిన హామీలు ఎలా నెరవేరుస్తారు?
- బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్ల రూపాయల విధ్వంసం
- అదే దారిలో రేవంత్ సర్కార్

2లో

కలంజ్యోతి, నాగర్ కర్నూల్ : నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట వద్ద జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ కుమార్ మృతదేహాన్ని అతడి స్వగ్రామానికి తరలించి, భార్య స్వర్ణలతకు అప్పగించినట్లు, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మనోజ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ.25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు.



## ఇంజినీరు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా




## ముజ్గి ఆరోగ్య కేంద్రం
# తనిఖీ చేసిన కలెక్టర్

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ గ్రామీణ మండలం ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఇన్ పేషంట్ , అవుట్ పేషెంట్ వార్డులు, స్టోర్ రూమ్, రోగులకు అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు
# నిరు పేదలకు వరం

**దౌల్తాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు హజ్మత్ అలీ అజ్జు**

**కలంజ్యోతి, నర్సాపూర్ :** హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన బొల్లారం లక్ష్మి నర్సమ్మ ఆరోగ్యం బాగోలేక ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందారు. హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ కు అర్జీ చేసుకోగా రూ.45,000 మంజూరయ్యాయి. కాగా.. లబ్ధిదారులకు గురువారం దౌల్తాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హజ్మత్ అలీ హజ్జు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పటేల్ కిషన్ గౌడ్, పిలముల యాదయ్య, నందూ, పిలముల నవీన్, ప్రశాంత్, పవన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళా

**కలంజ్యోతి, నర్సాపూర్ :** హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లోకనాథం ఆధ్వర్యంలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, ప్రవళిక, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# అప్పుల్లో రైజింగ్

- రొటేషన్ చక్రవర్తిలా ప్రభుత్వం
- అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులే
- ఇచ్చిన హామీలు ఎలా నెరవేరుస్తారు?
- బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్ల రూపాయల విధ్వంసం
- అదే దారిలో రేవంత్ సర్కార్

## బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**కలంజ్యోతి, హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తిలా ఉందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తిలా ఉందని, రాష్ట్ర దుస్థితికి మొదటి ముద్దాయి బీఆర్ఎస్ అయితే.. రెండో ముద్దాయి కాంగ్రెస్ అని మండిపడ్డారు. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లు అప్పులు చేసిందని, అప్పులు చేయటంలో మాత్రమే తెలంగాణ రైజింగ్ కనిపిస్తోందని ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వ పాలన ఫలితమే..**

గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల విధ్వంసం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఇప్పుడు గత ప్రభుత్వ దారిలోనే ఈ ప్రభుత్వం నడవడం బాధాకరమని ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వలేదంటూ అవాస్తవాలు మాట్లాడొద్దని, కాంగ్రెస్ కూటమిలో చేరేందుకు బీఆర్ఎస్ విశ్వ ప్రయత్నాలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంపై ఈ ప్రభుత్వం ఏం చర్య తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 11 శాతానికి తెచ్చిన వడ్డీలను రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారో.. లేదో? చెప్పాలని, కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై ఏం చర్యలు తీసుకున్నారని ఏలేటి ప్రశ్నించారు. తాజాగా డీలిమిటేషన్‌తో అన్యాయం అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారని, కుటుంబ పార్టీలే బీజేపీని వ్యతిరేకిస్తున్నాయని, డీలిమిటేషన్ మీద రాహుల్‌గాంధీ వైఖరి చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అడ్డగోలుగా హామీలు ఇచ్చింది.. ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయలేక డీలిమిటేషన్ అని కొత్తరాగం అందుకుందని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో చేరేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని అమలు కావడం లేదని, ఆసరా పెన్షన్ల పెంపు, మహిళలకు రూ.2500 ఏవి అని ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

# మహిళను హత్య చేసిన నిందితుడి అరెస్ట్

**కలంజ్యోతి, ఆందోల్ :**

మద్యం మత్తులో మహిళను హత్య చేసిన ఘటన ఇటీవల సంగారెడ్డి జిల్లా ఆందోలు నియోజకవర్గ పరిధిలోని వట్టిపల్లి మండలం ఖాదరాబాద్ గ్రామంలో జరిగింది. ఈ విషయంలో గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి గురువారం నిందితుడిని పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ అనిల్ కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 11న ఖాదీరాబాద్ గ్రామంలో కొట్టే గౌరమ్మ (40)ని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని వట్టిపల్లి పోలీస్ స్టేషన్లో ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. అప్పటినుంచి పోలీసులు ఈ హత్యకు సంబంధించిన వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తూ వచ్చారు.





కాగా.. అప్పటి నుంచి గ్రామంలో భూసిరెడ్డిపల్లి కిషన్ అనే వ్యక్తి కనిపించడం లేదన్న అనుమానంతో అతడిపై పోలీసులు ఆరా తీశారు. చివరకు గురువారం తన ఇంట్లో ఉన్నట్లు సమాచారాన్ని అందుకొని అతడి పట్టుకొని విచారించగా హత్య చేసింది తానేనని ఒప్పుకున్నాడు.

హత్య చేయడానికి కారణం కిషన్ ను గౌరమ్మ వ్యక్తిగతంగా తిట్టడాన్ని మనసులో పెట్టుకుని మద్యం మత్తులో అదేరాత్రి ఒంటరిగా ఉన్నా ఆమెపై ఇంటిలోకి వెళ్లి శారీరకంగా హింసించాడు. ఈ విషయాన్ని పెద్దల ముందు ఊరిలో పంచాయతీ పెట్టిస్తానని ఆమె బెదిరించడంతో ఆమెను గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం కారంపొడి చల్లి మంచాన్ని తగలబెట్టాడు. అదే మత్తులో ఆమెకు సంబంధించిన బంగారు నగలు తీసుకొని ఇంటి తలుపులు వేసి ఏమి తనకేమీ తెలియనట్టు అక్కడి నుంచి పరారయ్యాడని సీఐ వెల్లడించారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు చెప్పారు.





# సహాయక చర్యలు ముమ్మరం

- ఎస్ఎల్బీసీ, ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి
- టన్నెల్ లోకి మరోసారి కడావర్ డాగ్స్



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటిని నియమించింది. కాగా.. శివశంకర్ గురువారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు 34 రోజులుగా నిరంతరం సహాయక చర్యలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా సొరంగంలో ఉన్నటువంటి మట్టిని టీబీ ఎం భాగాలను ఊట నీటిని ఎప్పటికప్పుడూ తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. టన్నెల్ లోపల వ్యర్థ పదార్థాలను ఎప్ప టికప్పుడూ లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు వివరించారు. టన్నెల్లో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు కేరళకు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కడవర్ డాగ్స్ ను గురువారం సొరంగంలోనికి పంపినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, మేజర్ డాక్టర్ విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్, అధికారి అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి ఎన్.చంద్ర, హైడ్రా అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, కడవర్ డాగ్ ప్రతినిధి బృందం పాల్గొన్నారు.



## దిగువ కొండగట్టులో
# స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని దిగువ కొండగట్టు బస్టాండ్ చౌరస్తా రోడ్డుకు రెండు వైపుల స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని జగిత్యాల ఎస్పీ ఆదేశాల మేరకు స్పీడ్ బ్రేకర్లను మల్యాల సీఐ నీలం రవి, ఎస్ఐ నరేష్ కుమార్ గురువారం ఏర్పాటు చేశారు. ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ రోడ్డు నియమనిబంధనలు పాటించాలన్నారు.

## నిర్మల్ బార్ అసోసియేషన్
# అధ్యక్షుడిగా మల్లారెడ్డి

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి పదోసారి ఎన్నికయ్యారు. 2025 26 సంవత్సరానికి గురువారం నిర్వహించిన ఎన్నికలలో అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి తన సమీప ప్రత్యర్థిపై 17 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా షేర్ నరేందర్ తన సమీప ప్రత్యర్థిపై 7 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా అంపోలి నర్సారెడ్డి, కోశాధికారిగా సీహెచ్ అర్చన, సంయుక్త కార్యదర్శిగా ఏ ముత్తన్న, లైబ్రరీ సెక్రెటరీగా ఆర్ రత్నం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పీ వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు నూనె గంగాధర్, ఓస మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన న్యాయవాదులకు పలువురు న్యాయవాదులు, పట్టణ ప్రజలు అభినందనలు తెలిపి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.





## కొండగట్టు అంజన్న సన్నిధిలో
# రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారిని రాష్ట్ర బీసీ కమిషన్ చెర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు కలిసి స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆర్డీఓ మధుసూదన్ రావు, డీపీఓ రఘువరన్, మల్యాల తహశీల్దార్ మునిందర్, అధికారులు ఉన్నారు.




# ముందస్తు అరెస్ట్

**కలంజ్యోతి, నర్సాపూర్ :** పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమండ్ తో 'ఛలో అసెంబ్లీ' కి బయలుదేరిన హత్నూర మండలలోని పలు గ్రామాల్లో సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మచ్చ విజయలక్ష్మి నరేందర్, మాధవినవీన్ గౌడ్, మధుర, బాయికాడి సుధాకర్, నాగుల్ ని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మచ్చ విజయలక్ష్మినరేందర్ మాట్లాడుతూ మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించలేని ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తూ, పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయిస్తుందని విమర్శించారు. ఇకనైనా పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.



## ఘనంగా ఆవుల రాజురెడ్డి
# జన్మదిన వేడుకలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** పీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా నర్సాపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరిగి సాయికుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మంచితనానికి మారుపేరు గల రాజిరెడ్డి.. అన్న అంటే నేనున్నాననే మనస్తత్వం గల వ్యక్తి అని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# కొండగట్టు ఘాటు రోడ్డులో ప్రమాదం

**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఘాటు రోడ్డులో ప్రమాదం జరిగింది. అంజన్నను కుటుంబ సమేతంగా దర్శించుకొని తిరుగు ప్రయాణంలో ఆటో పై భాగం పైన కూర్చున్న ఇద్దరు భక్తులు ఘాటు రోడ్డు నుంచి దిగుతున్న సమయంలో ఆటో కుదుపులకు, సడెన్ బ్రేక్ వేయడంతో పైన కూర్చున్న భక్తులు కింద పడిపోయారు. దాంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట చెందిన శివరాత్రి సాయి కృష్ణ, ప్రేమచందుగా గుర్తించారు.



# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**కలంజ్యోతి, జగిత్యాల :** పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వకోట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్క సమాచారం మేరకు పేకాట స్థావరంపై సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడిచేసి ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.32,490నగదు, ఆరు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిని మేడిపల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అక్రమ, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి, పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్లు సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు వినోద్, రమేష్ పాల్గొన్నారు.

# మహిళ సంఘాల సమాచారం ఇవ్వండి

### సమాచార సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాము పటేల్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో వివిధ గ్రామాల మహిళ సంఘాలలో జరుగుతున్న అక్రమాలను బయటికి తీసేందుకు సమాచార సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాము పటేల్ డీఆర్డీఓ వరంగల్ ఆశ్రయించారు. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సమాచారం అందించాలని కోరారు. సంఘాలకు ఇచ్చిన సబ్సిడీ యంత్రాలు, మంజూరైన పావలా వడ్డీ రుణాలు, శ్రీనిధి నిధులు, 2020 నుంచి మంజూరైన నిధులు, గ్రామాల్లో ఇన్సూరెన్స్ ఎంతమందికి అందించారు, క్లైమ్ అయిన వివరాలను కోరినట్లు రాము పటేల్ తెలిపారు.



## రామోజీ ఫిలింసిటీ యజమాన్యంపై

# కేసు నమోదు చేయాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

### పేదలకు కేటాయించిన భూములను వెంటనే వారికి ఇవ్వాలి



**కలంజ్యోతి, ఆందోల్ :**

పేదల భూములు కబ్జా చేసిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి కఠి న చర్యలు తీసుకోవాలని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోవడానికి వెళ్లిన పేదలను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. రామోజీ ఫిలింసిటీ దగ్గర నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007 సంవత్సరంలో నాటి ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. కానీ ఆ భూముల వద్దకు వెళ్లకుండా రామోజీ సంస్థ ప్రహరీ నిర్మించిందని ఆరోపించారు. స్థలాలలోకి వెళ్లిన 75 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందన్నారు. ప్రభుత్వం దీనిని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ, రామోజీ సంస్థకే అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 400 మంది లబ్దిదారులను వారికి ఇచ్చిన స్థలాల వద్దకు తీసుకెళ్లడంతో పోలీసులు నాయకులపై, పేదలపై కర్కశంగా ప్రవర్తించి అరెస్టులు చేశారన్నారు. ఈ దుశ్చర్యను సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుదన్నారు. తక్షణమే ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రామోజీ సంస్థపై కేసులు నమోదు చేయాలని, పేద ప్రజలకు తమ ఇంటి స్థలాలను అప్పగించి, అక్కడే నివాసం ఉండే విధంగా ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, నాగేశ్వర రావు, వీరస్వామి, రమేష్ గౌడ్ తదితరులున్నారు.

# విలేకరిపై దాడి చేసిన మాఫియాపై చర్యలు తీసుకోవాలి

### ఆందోల్ డీఎస్పీ సత్తయ్యకు జర్నలిస్టుల వినతి



**కలంజ్యోతి, ఆందోల్ :**

అక్రమ బియ్యం మాఫియా జోగిపేట సాక్షి, వీ6 మీడియా విలేఖరులపై దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ దుర్ఘటన జర్నలిజంపై గొడ్డలి వేటని సీనియర్ జర్నలిస్టులు విష్ణువర్ధన్ రెడ్డి, యోగానంద రెడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డిలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సత్తయ్యకు ఆందోల్ జర్నలిస్టులపై జరిగిన హత్యాయత్నం చేసిన నిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోల్ జర్నలిస్టుల బృందంతో కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం ఆందోల్ మండలం సంగుపేట శివారులో రేషన్ బియ్యాన్ని అక్రమంగా బులోరా వాహనంలో యథేచ్ఛగా తరలిస్తున్న దృశ్యాన్ని ఆందోల్ వీ6 విలేఖరి అనిల్ చారి చిత్రీకరిస్తుండగా అక్కడికి బియ్యం మాఫియా గుండాలు దానిష్ పటేల్, ఎండి షకిల్, పుట్నాల ఆశం, ఇలియాస్ అనే వ్యక్తులు కారులో వచ్చి అందులో ఉన్న లాఠీలతో కక్ష్య పూరితంగా ఇద్దరు విలేకరులపై మూకుమ్మడి దాడి చేశారన్నారు. అందులో సాక్షి టీవీ విలేకరి జంగం శ్రీనివాస్ పై కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో విలేకరి ఎడమ చెయ్యి విరిగిపోయిందని, మొఖం పై గాయాలయ్యాయి. ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపేస్తామంటూ బెదిరిస్తూ గుండాయిజం చెలాయించారు. ఈ ఘటనపై బాధితులు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా జోగిపేట ఎస్ఐ పాండు దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఆందోల్ జర్నలిస్టులు స్పందిస్తూ ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విలేకరులపై దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని విలేకరుల బృందం వినతిపత్రంలో డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్పి సానుకూలంగా స్పందించి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోగిపేట విలేకరులు పడిగేల భగత్, హెచ్ ప్రదీప్ గౌడ్, సంజీవ్ కుమార్, కాశీనాథ్, శివ రత్నం, అనిల్ చారి, దిగంబర్, సందీప్ కుమార్, రాజు, మధు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఆందోల్ మల్లేశం, దళిత సంఘాల నాయకులు జంగం మహేష్ మొగులయ్య కరుణాకర్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఐటమ్ సాంగ్‌లో నభా నటేష్

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని, బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ కాంబోలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'జాట్'. పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్‌డ్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమాను తెలుగు అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని , వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్ గా థియేటర్స్ లో విడుదల కానుంది. ఇక ఇప్పటికే 'జాట్' నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్ అందరిలో క్యూరియాసిటీని పెంచాయి.  తాజాగా ఈ మూవీలో స్పెషల్ సాంగ్‌లో అలరించడానికి యంగ్ బ్యూటీ నభా నటేష్  ఫిక్స్ అయినట్లు ఓ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. హైదరాబాద్ లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన భారీ సెట్‌లో గురువారం నుంచే ఈ సాంగ్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది. మరి ఇందులో నిజమెంతుందో తెలియనప్పటికీ ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇక ఈ న్యూస్ విన్న నెటిజన్లు హీరోయిన్‌గా రాణిస్తున్న టైంలో ఐటెం సాంగ్స్ అవసరమా అంటూ కామెంట్స్ చేస్తున్నారు.